



# కరపత్రం

SINCE 2014

శనివారం మే 24 2025 | సంపుటి :0 | సంచిక :221 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


## 'ఆపరేషన్ సిందూర్'

### ఉగ్రవాదానికి దీటైన జవాబు: అమిత్ షా

పహల్గాం దాడులతో అన్ని హద్దులూ దాటిన ఉగ్రవాదులను పూర్తిగా నిర్మూలించడానికి.. వారి స్థావరాలపై భారత సైన్యం మెరుపుదాడులు చేసిందని అమిత్ షా పేర్కొన్నారు.



2లో

## కోటాలోనే విద్యార్థులు ఎందుకు చనిపోతున్నారు?..

రాజస్థాన్‌లోని కోటాలోనే విద్యార్థుల ఆత్మహత్యలు ఎందుకు చోటుచేసుకుంటున్నాయంటూ ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది.

2లో

## కవిత లేఖ

### ఓటిటి ఫ్యామిలీ డ్రామా



కాంగ్రెస్ వదిలిన బాణం అంటూ బండి సెటైర్స్

కవిత లేఖ డ్రామా వెనక రేవంత్ : రఘునందన

2లో

## వందేళ్లయినా కెసిఆర్ ఫ్యామిలీ అంతా ఒక్కటే

లేఖను సృష్టించాల్సిన పని రేవంత్‌కు ఎందుకు?

బిఆర్ఎస్ డ్రామాలో భాగమే కవిత లేఖ: కోమటిరెడ్డి



2లో

## ఎన్నికలప్పుడే రాజకీయాలు...

# అందరినీ కలుపుకుని పోతా



రాష్ట్రాభివృద్ధి కోసం ప్రధానిని కలుస్తూనే ఉంటా

కెసిఆర్ తన 40 ఏళ్ల అనుభవాన్ని అభివృద్ధికి కేటాయించాలి

నిమ్జ్ భూ బాధితులకు న్యాయం చేస్తాం

వారికి పరిహారం న్యాయయం చేసే బాధ్యత జగ్గారెడ్డిదే

జహీరాబాద్ పర్యటనలో సిఎం రేవంత్ రెడ్డి

ఎన్నికలప్పుడే రాజకీయాలు అని.. తర్వాత అందరినీ కలుపుకుని ముందుకెళ్తామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ అభివృద్ధికి నిరంతరం పనిచేస్తామని తెలిపారు. ఎన్నిసార్లయినా ప్రధాని మోదీని కలుస్తామని.. తెలంగాణకు అవసరమైన నిధులు తీసుకొస్తామని వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరస్పర సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని ముఖ్యమంత్రి అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం జహీరాబాద్ హుగ్గెల్లిలో బసవేశ్వర విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. ఆపై కేంద్రీయ విద్యాలయం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ పాల్గొన్నారు. అనంతరం పస్తాపూర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. జహీరాబాద్ పారిశ్రామికవాడ భూసేకరణలో అన్యాయం జరిగిందని తన దృష్టికి వచ్చిందన్నారు. భూములు ఇచ్చిన రైతులకు పరిహారం పెంచామని.. 2లో

## రేపటి నుంచి HYD మెట్రో

# ఛార్జీల తగ్గింపు



హైదరాబాద్: హైదరాబాద్‌లో తగ్గించిన మెట్రో ఛార్జీలు శనివారం నుంచి అమలు చేయనున్నారు. సవరించిన మెట్రో ఛార్జీల కనీస ధర రూ.11, గరిష్ఠ ధర రూ.69. రెండు కి.మీ వరకు మెట్రో ఛార్జీని రూ.12 నుంచి రూ.11కు తగ్గించారు. 2 నుంచి 3 కి.మీ వరకు రూ.18 నుంచి రూ.17కి.. 4 నుంచి 6 కి.మీ వరకు రూ.30 నుంచి రూ.28కి తగ్గించారు. 6 నుంచి 9 కి.మీ వరకు మెట్రో ఛార్జీని రూ.40 నుంచి రూ.37కి తగ్గించారు. ఇటీవల హైదరాబాద్ మెట్రో ఛార్జీలను పెంచారు. అనంతరం వీటిని తగ్గిస్తూ సవరణ చేశారు.

9 నుంచి 12 కి.మీ వరకు మెట్రో ఛార్జీ రూ.50 నుంచి రూ.47కి తగ్గింపు

12 నుంచి 15 కి.మీ వరకు రూ.55 నుంచి రూ.51కి తగ్గింపు

15 నుంచి 18 కి.మీ వరకు రూ.60 నుంచి రూ.56కి తగ్గింపు

18 నుంచి 21 కి.మీ వరకు రూ.66 నుంచి రూ.61కి తగ్గింపు

21 నుంచి 24 కి.మీ వరకు రూ.70 నుంచి రూ.65కి తగ్గింపు

24 కిలోమీటర్లకు పైగా రూ.75 నుంచి రూ.69కి తగ్గింపు

## ఎంపీ డీకే అరుణకు కేంద్రం కీలక బాధ్యతలు

దిల్లీ: ఎంపీ డీకే అరుణకు కేంద్రం కీలక బాధ్యతలు అప్పగించింది. ఎఫ్‌సీఐ కన్సల్టేటివ్ కమిటీ తెలంగాణ ఛైర్‌పర్సన్‌గా డీకే అరుణను నియమించింది. ఈ మేరకు పార్లమెంట్ వ్యవహారాల శాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీ రాష్ట్రంలో ఆహార ఉత్పత్తులు, ధాన్యం సేకరణలో సమస్యపై అధ్యయనం చేయనుంది. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన కేంద్ర ప్రభుత్వానికి డీకే అరుణ కృతజ్ఞతలు తెలిపారు.



## విప్రో ఛైర్మన్, సీఈఓ

## పారితోషికం ఎంతో తెలుసా?

దిల్లీ: ప్రముఖ ఐటీ సేవల సంస్థ విప్రో ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా రిషద్ ప్రేమ్‌జీ గత ఆర్థిక సంవత్సరంలో 1.6 మిలియన్ డాలర్ల పారితోషికం అందుకున్నారు. అంటే మన భారత కరెన్సీలో రూ.13.7 కోట్లు పొందారు. మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి ఈ మొత్తం అందుకున్నట్లు కంపెనీ తన వార్షిక నివేదికలో పేర్కొంది. గతేడాదితో పోలిస్తే ఈ మొత్తం రెట్టింపు అయ్యింది. అయితే, విప్రో సీఈఓ శ్రీనివాస్ పల్లియా పారితోషికంతో పోలిస్తే రిషద్ ప్రేమ్‌జీకి చేసిన చెల్లింపులు తక్కువే




2లో

# అడ్డం తిరిగిన కిడ్నాప్ కథ..

# కన్నతల్లే హంతకురాలు

దుబ్బాక: పేగుబంధానికి తలవంపులు తెచ్చే ఘటన ఇది. నవ మాసాలు మోసి జన్మనిచ్చిన కన్నతల్లి మానవత్వం మరిచి కర్కశంగా మారింది. 80 రోజుల పసికందును బావిలో పడేసి చంపేసింది. ఈ ఘటన దుబ్బాక మండలం అప్పనపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకోగా.. పసికందు మృతదేహాన్ని గురువారం వెలికి తీశారు. ఇంటి ముందు ఆడిస్తున్న పసికందును ఇద్దరు దుండగులు అపహరించారని కన్నతల్లి పోలీసులను తప్పుదోవ పట్టించింది. చివరికి విచారణలో తానే తన కన్న కొడుకును బావిలో వేసి చంపినట్లు అంగీకరించడంతో శుక్రవారం పోలీసులు ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

దుబ్బాక సీఐ పాలెపు శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామానికి చెందిన రామగళ్ళ శ్రీమాన్ నంగునూరు మండలం నర్మెట్టకు చెందిన కవితను మూడు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకొని పుల్లూరులోనే నివాసం ఉంటున్నారు. శ్రీమాన్ ఇటీవల రెండు చోరీ కేసుల్లో జైలుకు వెళ్లి రావడంతో గ్రామంలో పరువు పోయిందని, అతని అమ్మమ్మ ఊరైన అప్పనపల్లిలో గత రెండు నెలల నుంచి ఉంటున్నారు.



తన బిడ్డను ఇద్దరు దుండగులు కిడ్నాప్ చేశారని తల్లి పోలీసులను తప్పుదోవ పట్టించింది.

విచారణలో తానే కుమారుడిని చంపినట్లు అంగీకరించడంతో పోలీసులు అరెస్టు చేశారు.

భర్త వేధింపులు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా భర్త నుండి విడిపోవాలని తల్లి నిర్ణయించుకుంది.

విడిపోవడానికి అడ్డుగా ఉన్న కుమారుడిని చంపాలని భావించింది.

మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాబును బావిలో విసిరేసింది.

2లో

# ఎన్నికలప్పుడే రాజకీయాలు... అందరినీ కలుపుకుని పోతా

మొదటి పేజీ తరువాయి
జహీరాబాద్ నిమ్జ్‌లో భూములు కోల్పోయిన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని... నిమ్జ్‌లో భూములు కోల్పోయిన 5,612 కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. మెదక్ జిల్లా పేరు చెబితేనే ఇందిరమ్మ గుర్తొస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. మెదక్ ప్రజలను కాంగ్రెస్ ఎల్లప్పుడూ గుర్తుపెట్టుకుంటుందన్నారు. గేట్ వే ఆఫ్ ఇండస్ట్రీస్‌గా జహీరాబాద్ కావాలని కృషి చేశామని తెలిపారు. జహీరాబాద్‌కు అవసరమైన నిధులు మంజూరు చేస్తామన్నారు. నారాయణఖేడ్ అభివృద్ధిపై ప్రత్యేకంగా సమిక్ష చేస్తామన్నారు. భవిష్యత్‌లోనూ మెదక్‌లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. సింగూరు ప్రాజెక్ట్‌ను ఎకో టూరిజం కింద తీర్చిదిద్దుతామన్నారు. సింగూరును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు నిధులు ఇస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రైతులను అప్పులబాధ నుంచి తప్పించామని.. రైతు భరోసా పథకం అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. గతంలో వరి వేస్తే ఉరే అన్నారని గుర్తుచేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కోసం రూ.5 వేల కోట్లకు పైగా కేటాయించామని చెప్పారు. కోటి మంది మహిళలను కోటీ-శ్వరులను చేసేందుకు కంకణం కట్టు-కున్నామని స్పష్టం చేశారు. ఆడబిడ్డను ఆర్థికంగా నిలబెట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆడబిడ్డ ఆర్థికంగా నిలబడితే కుటుంబాలు బాగుపడతాయని తెలిపారు. ఐదేళ్లలోపు కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మారుస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామన్నారు. మీరు అండగా ఉండండి... ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యత నాదని సిఎం రేవంత్ వెల్లడించారు. గత ప్రభుత్వ నేత అలిగి ఫామ్‌హౌస్‌లో పడుకున్నారంటూ విమర్శించారు. అభివృద్ధి కోసం కేంద్రంతో కలిసి పనిచేస్తామని అన్నారు. ప్రతిపక్ష నేత అసెంబ్లీకి రావాలని... సలహాలు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రతిపక్ష రాజకీయ నాయకులు అసెంబ్లీకి రావాలని మరోసారి సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మీ 40 ఏళ్ల రాజకీయ అనుభవాన్ని మాకు చెప్పండని కోరారు. పదవి ఉంటేనే వస్తా అంటే ఎలా? అని ప్రశ్నించారు. మేము పదేళ్లు ప్రతిపక్షంలో ఉన్నామని.. ప్రతిపక్షంలో ఉంటే ప్రజల పక్షాన పోరాడాలని హితవు పలికారు. ఏ రోజు తాను సీఎంగా అహంకారానికి పోలేదని చెప్పారు. మీరు అండగా ఉంటే అద్భుతాలు చేస్తామని.. ప్రపంచంలో తెలంగాణని గొప్ప రాష్ట్రంగా తీర్చుదిద్దుతామని తెలిపారు. రైతులను అప్పుల బాధ నుంచి విముక్తి కలిగించామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రైతు భరోసాని 12 వేలకు పెంచి సహాయం అందిస్తున్నామని చెప్పారు. భూమి లేని రైతులకు కూడా సహాయం అందిస్తున్నామని తెలిపారు.. వరి వేసుకుంటే ఉరే అని ఆనాటి సీఎం అన్నారని.. కానీ నేడు వరి పంటకు బోనస్ ఇస్తున్నామన్నారు. 18 నెలల్లో మహాలక్ష్మి పథకం కోసం 5500 కోట్లు-కేటాయించామని.. కోటి మంది మహిళలను కొటేశ్వరులు చేయాలన్నదే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. మిస్ వరల్డ్ కాంపిటీషన్ కి వచ్చిన వారు మన ఆడబిడ్డలు చేసిన వస్తువులను చూశారన్నారు.. మహిళలే బస్సులు కొని ఆర్టీసీకి కిరాయి ఇచ్చేలా చర్యలు తీసుకున్నట్లు- వివరించారు. ఇందిరమ్మని ఆదర్శంగా తీసుకుని సోనియమ్మ స్ఫూర్తితో ఆడబిడ్డలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తామని భరోసా ఇచ్చారు.తెలంగాణ ఉద్యమంలో కీలకంగా ఉన్న యువతకు గత పదేళ్లుగా ఉద్యోగాలు లేవని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమంలో తాను ముందున్న అన్న వ్యక్తి ఇంట్లో మాత్రం అందరికి ఉద్యోగాలు వచ్చాయని విమర్శించారు.. నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి కోసం చర్యలు తీసుకుంటు-న్నామని.. మీ అందరూ అండగా ఉంటే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమని చెప్పారు.అలాగే సీఎం రేవంత్‌రెడ్డి జగ్గారెడ్డి గురించి మాట్లాడారు. జగ్గారెడ్డి భూములు కోల్పోతున్న వారికి న్యాయం చేస్తారు. వారికి ఇళ్ల పట్టాలు అందించే బాధ్యత జగ్గారెడ్డికి అప్పజెబుతున్నా. వారికి మంచి భోజనం పెట్టించి జగ్గారెడ్డి పట్టాలు ఇస్తారు. జహీరాబాద్ అభివృద్ధి కోసం ప్రత్యేక సమీక్ష చేసి నిధులు మంజూరు చేస్తాం. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు...ఆ తర్వాత అభివృద్ధి మన అజెండా. సంజీవ రెడ్డి, సురేష్ షెట్కార్ నారాయణఖేడ్ కి రెండు కళ్ళలాంటి వారు. పటాన్ చెరు మినీ ఇండియా ప్రాంతం. ఇఐఊర, ఇఊర, కఒః, ఇక్రిశాట్ ఇవన్నీ కాంగ్రెస్ హయాంలో వచ్చినవే.. సింగూరు నుంచి మంజీరా జలాలు హైదరాబాద్ దాహార్తిని తీరుస్తున్నాయి. సింగూరు ప్రాజెక్టును టూరిజం హబ్ గా మారుస్తాంఅని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

## ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యం.



– సమస్యల పరిష్కారానికై ప్రత్యేక శ్రద్ధ వహిస్తా: ఎమ్మెల్యే సత్యానందరావు

**కొత్తపేట (ఏపీ) కరపత్రం ప్రతినిధి**
ప్రజల సమస్యలకు సరైన పరిష్కార వేదిక ప్రజాదర్బార్ అని, ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు.రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద సత్యానందరావు ప్రజాదర్బార్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలకు నేరుగా పరిష్కారం మార్గం చూపేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తానని తెలిపారు.నేడు నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో 163 వినతులు వచ్చినట్లు తెలిపారు.సమస్యలను బట్టి వాటి పరిష్కార సమయం ఉంటుందని అన్నారు.ప్రజలు ఇచ్చిన సమస్యల వినతులు పరిష్కారం అయ్యే వరకు వాటిపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని ఎమ్మెల్యే సత్యానందరావు తెలిపారు.

## సిపిఐ సానుభూతిపరురాలు మృతి

– నివాళులర్పించిన సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్



**ఖమ్మం రూరల్ కరపత్రం ప్రతినిధి**
ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డుకు చెందిన సిపిఐ సానుభూతిపరురాలు ఆడెపు చిట్టెమ్మ (74) అనారోగ్యంతో శుక్రవారం ఇంటి వద్ద మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. మృతురాలికి ఒక కుమారుడు ఒక కుమార్తె ఉన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ మండల సమితి సభ్యులు దండి రంగారావు, వెంపటి సురేందర్, వెంపటి రాము, ఏఐవైఎఫ్ యువజన సంఘం సభ్యులు మిరియాల నరుణ్ తేజ్, అక్కినపల్లి దేవయ్య, రెబ్బగొండ్ల గోపి తదితరులు ఉన్నారు.

## వందేళ్లయినా కెసిఆర్ ఫ్యామిలీ అంతా ఒక్కటే

మొదటి పేజీ తరువాయి
ఆర్టిఫిషియల్ లేఖను కూడా ఎమ్మెల్సీ కవిత సరిగా రాయలేక పోయారని మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి విమర్శించారు. లేఖకు, ఎమ్మెల్సీ కవితకు సంబంధమే లేదని కోమటిరెడ్డి తెలిపారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసింట్ కెటిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు కలిసి కవిత పేరుతో లేఖ రాశారని అన్నారు. కోమటి రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. లెటర్ ఆలోచన ఎలా వచ్చిందో, ఎక్కడ ప్లాన్ వేశారో తనకంతా తెలుసునని చెప్పారు. 20 లేదా 30 సీట్లలోనే బిఆర్ఎస్ పోటీ- చేస్తుందని, బిఆర్ఎస్ వచ్చే ఎన్నికల్లో బిజెపితో కలుస్తుందని జోస్యం చెప్పారు. వందేళ్లయినా కెసిఆర్ కుటుంబం కలిసే ఉంటుందని, కెసిఆర్ కుటుంబంలో కలహాలు అనేది పెద్ద డ్రామా అని ఎద్దేవా చేశారు. కవిత గురించి ఆలోచించే సమయం తనకే లేదని, ఇక మా సిఎం రేవంత్ రెడ్డికి ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. వరంగల్ లో కెసిఆర్ పెట్టిన సభ తాను ఒక్కడినే పెట్టగలనని కోమటి రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. భారాసకు భవిష్యత్తు లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌కు ఆయన కుమార్తె, ఎమ్మెల్సీ కవిత రాసినట్లు- బయటకు వచ్చిన లేఖపై ఆయన స్పందించారు. ఆ లేఖ.. ఓ జోక్ అని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కోమటిరెడ్డి మాట్లాడారు. మాజీ ఎంపీ, ప్రస్తుత ఎమ్మెల్సీ రాసే లేఖ ఓ పద్ధతిగా ఉందా? ఆ లేఖను సృష్టించాల్సిన అవసరం మాకేంటి? భారాసలో చీలిక ఏమీ లేదు.. ఇదంతా ఓ డ్రామా. దానిలో భాగమే ఈ లేఖ. తండ్రికి లేఖ రాయాల్సిన అవసరమేంటి? ఆమె నేరుగా చెప్పొచ్చు కదా! కల్వకుంట్ల కుటుంబంలో విభేదాలు వస్తాయంటే ఎవరైనా నమ్ముతారా? వారు గొడవపడరు.. ఒకవేళ అలా జరిగితే అది ఆస్తుల గురించే అవుతుందని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు.

## అడ్డం తిరిగిన కిడ్నాప్ కథ.. కన్నతల్లే హంతకురాలు

మొదటి పేజీ తరువాయి
ఎంతో ఆనందంగా ఉంటుందనుకున్న జీవితం ప్రశ్నార్థకంగా మారడంతో పాటు ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త తరచూ వేధింపులకు గురి చేస్తుండటం, ఆర్థిక ఇబ్బందులు, భర్త ప్రవర్తన, వ్యవహార శైలి నచ్చని కవిత భర్తతో విడిపోవడానికి సిద్ధపడింది.

### భర్త నుంచి విడిపోయి దూరంగా వెళ్లి పోవాలని..

ఈ క్రమంలో అడ్డుగా ఉన్న పసికందును తప్పిస్తే.. భర్తను విడిచిపెట్టి హాయిగా ఉండొచ్చని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పసికందు దీక్షిత్ కుమార్‌ను తీసుకెళ్లి గ్రామశివారులో ఉన్న పాడుబడిన వ్యవసాయ బావిలో విసిరేసి వెళ్లిపోయింది. తన దగ్గర నుంచి ఇద్దరు ముసుగు వేసుకొని వచ్చిన దుండగులు బాబును ఎత్తుకెళ్లారని చెప్పి, అందరిని తప్పుదోవ పట్టిస్తూ కిడ్నాప్ జరిగినట్టుగా పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు కవిత చెబుతున్న విషయాలకు, జరిగిన ఘటనకు పొంతన లేకపోవడంతో ఆమెను తమదైన శైలిలో విచారించారు. భర్త నుంచి విడిపోయి దూరంగా వెళ్లిపోవాలని.. అడ్డుగా ఉన్న కుమారుడిని తానే బావిలో వేసి చంపినట్లు అంగీకరించింది. దీంతో ఆమె భర్త శ్రీమాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కిడ్నాప్ కేసును హత్య కేసుగా మార్చిన పోలీసులు కవితను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## కోటాలోనే విద్యార్థులు ఎందుకు చనిపోతున్నారు?..

మొదటి పేజీ తరువాయి



రాజస్థాన్‌లో విద్యార్థుల వరుస ఆత్మహత్యలపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. కోటాలోనే ఇవి ఎందుకు చోటుచేసుకుంటున్నాయంటూ ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఈ ఏడాది ఇప్పటికే 14 మంది విద్యార్థులు బలవంతంగా ప్రాణాలు తీసుకోవడాన్ని తీవ్రంగా పరిగణించిన సుప్రీంకోర్టు.. రాష్ట్ర ప్రభుత్వంగా ఏం చేస్తున్నారంటూ నిలదీసింది. కోటా, ఐఐటీ ఖరగ్‌పుర్‌లకు చెందిన ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్యల కేసులను విచారించిన జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం.. ఎఫ్ఐఆర్ నమోదులో పోలీసుల వైఖరిని తప్పుపట్టింది.
ఐఐటీ ఖరగ్‌పుర్‌కు చెందిన విద్యార్థి (22) ఆత్మహత్యకు సంబంధించిన కేసును సుప్రీం విచారించింది. మే 4న హాస్టల్ గదిలో ఉరివేసుకొని మరణించగా.. పోలీసులు మాత్రం మే 8న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేసు నమోదుకు నాలుగు రోజులు ఆలస్యం ఎందుకు అయ్యిందని సంబంధిత పోలీసు అధికారిని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ కేసులను తేలికగా తీసుకోవద్దని, చాలా తీవ్రత కలిగిన అంశాలని పేర్కొంది. ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థుల వరుస ఆత్మహత్యలకు సంబంధించి మార్చి 24న ఇచ్చిన తీర్పును ప్రస్తావించిన న్యాయస్థానం.. ఇటువంటి కేసుల్లో ఎఫ్ఐఆర్ త్వరగా నమోదుచేయడం ఎంతో ముఖ్యమని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా పోలీసు అధికారి, ఐఐటీ ఖరగ్‌పుర్ తరఫు న్యాయవాది ఇచ్చిన వివరణలపై సుప్రీం ధర్మాసనం అసంతృప్తి వ్యక్తంచేసింది.
పోక్సో చట్టం కింద దోషిగా తేలిన వ్యక్తికి ఏ శిక్షా వేయని సుప్రీంకోర్టు!
కోటాలో నీట్ కు సన్నద్ధమవుతోన్న విద్యార్థిని ఆత్మహత్య చేసుకోగా.. ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడాన్ని ధర్మాసనం తప్పుపట్టింది. గతంలో న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ధిక్కరిస్తున్నారని, ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదని నిలదీసింది. సంబంధిత పోలీసు అధికారి విధి నిర్వహణలో విఫలమయ్యారని, కోర్టు ఆదేశాలను ఆయన పాటించలేదని పేర్కొంది. దీనిపై జులై 14 సదరు పోలీసు అధికారి హాజరై వివరణ ఇవ్వాలని సమన్లు జారీచేసింది. “రాష్ట్ర ప్రభుత్వంగా ఏం చేస్తున్నారు? కోటాలోనే విద్యార్థులు ఎందుకు ఆత్మహత్య చేసుకుంటున్నారు? ఈ విషయంపై ఎందుకు ఆలోచించడం లేదు? అని రాజస్థాన్ ప్రభుత్వం తరఫు న్యాయవాదిని సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. ఇందుకు న్యాయవాది బదులిస్తూ.. ఆత్మహత్యల కేసులను పరిశీలించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు.

## విప్రో ఛైర్మన్, సీఈఓ పారితోషికం ఎంతో తెలుసా?

మొదటి పేజీ తరువాయి
కావడం గమనార్హం. ఇదే కాలానికి పల్లియా 6.2 మిలియన్ డాలర్లు అంటే రూ.53.64 కోట్లు పారితోషికంగా పొందారు.
2023-24 ఆర్థిక సంవత్సరంలో రిషద్ ప్రేమ్‌జీ రూ.6.4 కోట్లు మాత్రమే పారితోషికం తీసుకున్నారు. ఆ ఏడాది కంపెనీ లాభంలో క్షీణత నమోదు కావడంతో ఆయన ఎలాంటి కమీషన్ తీసుకోలేదు. అలాగే, తనకు చెల్లించే జీతభత్యాల్లో 20 శాతం కోత విధించుకున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో విప్రో తన నికర లాభంలో 18.9 శాతం వృద్ధిని నమోదు చేసి రూ.13,135.4 కోట్లు ఆర్జించింది. దీంతో ఆయన పారితోషికం కూడా రూ.6.4 కోట్ల నుంచి రూ.13.7 కోట్లకు పెరిగింది. యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ కమిషన్‌కు విప్రో మర్పించిన ఫైలింగ్‌లో ఈ వివరాలు వెల్లడయ్యాయి.కియా కరెన్స్ క్లావిస్ విడుదల.. ధర రూ.11.50 లక్షల నుంచి ప్రారంభమరోవైపు థియరీ డెలాపోర్టే తర్వాత సీఈఓ, ఎండీగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్ పల్లియా గత ఆర్థిక సంవత్సరంలో రూ.53.64 కోట్లు పారితోషికంగా అందుకున్నారు. డెలాపోర్టేతో పోలిస్తే ఈయన పే దాదాపు సగానికంటే తక్కువ. 2023-24 ఆర్థిక సంవత్సరానికి డెలాపోర్టే రూ.168 కోట్లు పారితోషికంగా అందుకున్నారు. శ్రీనివాస్ పల్లియా అందుకున్న పారితోషికంలో 1.7 మిలియన్ డాలర్లు వేతనం, అలవెన్సు రూపంలో కాగా.. 1.7 మిలియన్ డాలర్లు కమీషన్/వేరియబుల్ పేగా తీసుకున్నారు. 2.8 మిలియన్ డాలర్లు ఇతరాలుగా పేర్కొన్నారు. కంపెనీ మొత్తం లాభాల్లో 0.35 శాతం చొప్పున రిషద్, పల్లియా కమీషన్ రూపంలో అందుకున్నారు. గత ఆర్థిక సంవత్సరానికి పల్లియాకు అదనంగా 16,77,202 స్టాక్ ఆప్షన్లు కేటాయించగా.. ప్రేమ్‌జీకి ఎలాంటి స్టాక్ ఆప్షన్లు జారీ చేయలేదు.

## 'ఆపరేషన్ సిందూర్'

### ఉగ్రవాదానికి దీటైన జవాబు: అమిత్ షా

మొదటి పేజీ తరువాయి
పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత్ జరిపిన ఆపరేషన్ సిందూర్ ఉగ్రవాదానికి దీటైన జవాబు అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. పహల్గాం దాడులతో అన్ని హద్దులూ దాటిన ఉగ్రవాదులను పూర్తిగా నిర్మూలించడానికి.. వారి స్థావరాలపై భారత సైన్యం మెరుపుదాడులు చేసిందన్నారు. పాక్‌లో ఉన్న ఉగ్రస్థావరాలను భారత్ బయటపెట్టడంతో.. ఆ దేశం ఉగ్రవాదులను పోషిస్తుందనే నిజం మరోసారి ప్రపంచానికి తెలిసిందన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను ప్రపంచమంతా కొనియాడిందని షా పేర్కొన్నారు.
ప్రధాని నరేంద్ర మోదీ బలమైన రాజకీయ సంకల్పం.. నిఘా సంస్థలు అందించిన కచ్చితమైన సమాచారం.. త్రివిధ దళాల అద్భుత ప్రదర్శన వల్లే ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయ్యిందని అమిత్ షా అన్నారు. పాక్.. భారత్‌పై క్షిపణులు ప్రయోగించిన సమయంలో దేశాన్ని కాపాడడంలో బీఎస్ఎఫ్ దళాలు ముఖ్యపాత్ర పోషించాయని అమిత్ షా అన్నారు. బంగ్లాదేశ్‌తో సహా అంతర్జాతీయ సరిహద్దులను కాపాడటంలో బీఎస్ఎఫ్ పాత్రను అభినందించారు. పాకిస్థాన్ చేస్తున్న తప్పిదాల వల్ల భారత్ అనేక దశాబ్దాలుగా ఉగ్ర సమస్యను ఎదుర్కొంటుందని పేర్కొన్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన నాటినుంచి భారత్ ఉగ్ర దాడులకు గట్టి బదులిస్తోందని అన్నారు. పహల్గాం ఘటన సమయంలో ఉగ్రవాదులు పర్యాటకులను మతం అడిగి మరీ చంపడం దారుణమని ఆవేదన వ్యక్తంచేశారు.
ఆపరేషన్ సిందూర్‌లో 9 ఉగ్రవాద స్థావరాలను భారత సైన్యం ధ్వంసం చేసిందని.. వాటిలో 2 వాటి ప్రధాన ఉగ్ర కార్యాలయాలు ఉన్నాయని తెలిపారు. అయితే ఈ దాడిలో పాక్ ప్రజలకు గానీ, సైనిక స్థావరాలకు గానీ ఎటువంటి నష్టం కలిగించలేదని స్పష్టంచేశారు. కానీ పాక్ సైన్యం మాత్రం నిషేధిత ఉగ్రవాదుల అంత్యక్రియలకు హాజరై.. ఉగ్రవాదానికి మద్దతు పలికారని అమిత్‌షా అన్నారు. వారి చర్యలను ప్రపంచం మొత్తం చూసిందని.. ఉగ్రవాదుల వెనక ఎవరు ఉన్నారనే విషయం అన్ని దేశాలకు అర్థమయ్యిందని తెలిపారు. 1965 నుంచి నేటివరకు దేశ ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలు అర్పించిన 2,000 మందికి పైగా సరిహద్దు గార్డులకు దేశం తరఫున నివాళులర్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

## కవిత లేఖ ఓటిటి ఫ్యామిలీ డ్రామా

మొదటి పేజీ తరువాయి
బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు ఆయన కుమార్తె, ఆ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాసిన లేఖ ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ లేఖపై ఇప్పటికే రేవంత్ క్యాబినెట్‌లోని పలువురు మంత్రులు స్పందించారు. తాజాగా కవిత లేఖపై బీజేపీ సైతం స్పందించింది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తన ట్విట్టర్ వేదికగా శుక్రవారం స్పందించారు. కాంగ్రెస్ వదిలిన బాణం అనే శీర్షికతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత.. డాడీకి రాసిన లేఖ ఒక ఓటీటీ- ఫ్యామిలీ డ్రామాగా మారవచ్చునని ఆయన వ్యంగ్యంగా అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు.. తెలంగాణను విఫలం చేశాయని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో వారంత కలిసి బీజేపీని నిందిస్తున్నారని చెప్పారు. కుటుంబ పాలనను తమ పార్టీ నిత్యం వ్యతిరేకిస్తునే ఉందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అది గాంధీ ఫ్యామిలీ అయినా.. కల్వకుంట్ల ఫ్యామిలీ అయినా అని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. కుటుంబ పార్టీలు వారి వ్యక్తిగత సంక్షోభాలను ప్రజా భావోద్వేగంగా మార్చడానికి ప్రయత్నిస్తాయన్నారు. ఎవరైనా దోషి అయితే.. వారిని ఏదీ రక్షించ లేదన్నారు. కానీ ఈ అంశాన్ని తెలంగాణ చూస్తుందని.. ఆ క్రమంలో ఈ డ్రామాను తీవ్రంగా పరిగణించడం లేదని తెలిపారు.
అయితే ప్రతీ సర్వేలో భారతీయ జనతా పార్టీ గ్రాఫ్ పెరుగుతుందన్నారు. శబ్దం లేకుండా, అధికారం లేకుండా, కేవలం ప్రజల నమ్మకంతోనే తమ పార్టీ ప్రజల్లో అంతర్లీన ప్రవాహంగా వెళ్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు నిజమైన మార్పుతోపాటు-అభివృద్ధిని సైతం కోరుకుంటున్నారని తెలిపారు. రాజకీయం.. కుటుంబ డ్రామా కాదన్నారు. ఆ మార్పు బీజేపీతోనే అవుతుందని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. ఇక కల్వకుంట్ల కవిత లేఖపై బీజేపీ ఎంపీ ఎం. రఘునందన్ రావు స్పందించారు. కవిత లేఖ రాజకీయ పంచాయితీనా? ఆస్తుల పంచాయితీనా? అంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. కవిత మరో షర్మిల కాబోతున్నట్లు- కనిపిస్తోందని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీలోకి కవిత వెళ్లే అవకాశాలు కనపడుతున్నాయన్నారు. కవిత లేఖ డ్రామా వెనుక సీఎం రేవంత్ రెడ్డి ఉన్నట్లు కనిపిస్తోందని చెప్పారు. కేసీఆర్ కుటుంబంలో వారసత్వ చిచ్చు నిజమని తెలుస్తోందన్నారు. కవితను బయటకు పంపేందుకే కేటీఆర్, హరీశ్‌రావు ఒకటయ్యారని తెలిపారు. ఎవరు ఏం చేసినా తెలంగాణలో మాత్రం బీజేపీదే అధికారమని ఎంపీ రఘునందన్ రావు స్పష్టం చేశారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శనివారం మే 24 2025

# “కర్రె” రంగు పులుముకున్న ఎర్ర సైన్యం

## – ఆయుధంతో పుట్టిన మావోయిజం ఆయుధంతోనే అంతమవుతుందా!

శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్

**– మావోయిస్టు పార్టీ సుప్రీం కమాండర్, పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్కౌంటర్ తో మావోయిజం పెను సవాలుకు గురయింది**

అధిక సంఖ్యలో చనిపోతున్న మావోయిస్టులు. ఈ చావులకు కారణం “ఆపరేషన్ కగార్”..

ఆపరేషన్ కగార్ ఇప్పుడు ప్రభలంగా, ప్రముఖంగా వినిపిస్తున్న పేరు. 1965 ప్రాంతంలో పశ్చిమ బెంగాల్లో భూస్వామ్య వ్యతిరేక పోరాటంగా పుట్టిన భావన నక్సలిజం గా పేరు పడింది. ఆ నక్సలిజం మావోయిజముగా రూపాంతరం చెంది ఇప్పుడు ఒక ప్రత్యేక సైన్యము, ప్రైవేటు సైన్యము ఏర్పరచుకొని కర్రెగుటల్లో, అబూజ్ మడ్ లో తిష్ట వేసి భారత రాజ్యాంగాన్ని, భారత ప్రభుత్వాన్ని,రక్షణ దళాలను సవాలు చేస్తున్నది. ఈ నక్సలిజం ఆలోచనకు సృష్టికర్త చారు మజుందార్. మార్క్సిస్టు పార్టీ పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని నడుపుతున్న కాలంలో పుట్టిన ఈ సాయుధ పోరుకు చారు మజుందార్ ఒక కార్యాచరణను రూపొందించాడు. స్వయంగా ఒక కమ్యూనిస్టు అయిన చారు దాదా చైనా నాయకుడు మావో ప్రేరణతో భారతదేశంలో ఒక సాయుధ పోరును కలగన్నాడు. కమ్యూనిస్టు పార్టీలో పేరుకుపోయిన రివిజనిజం ను వ్యతిరేకిస్తూ, చైనా మాదిరిగా ఒక సాయుధ సైన్యాన్ని ఏర్పరిచి అతివాద కమ్యూనిస్టు ఆచరణను ప్రతిపాదించాడు.నక్సలబరీ గ్రామంలో పుట్టిన ఈ తిరుగుబాటు నక్సలిజం గా పేరు పొందింది.నక్సలైట్ పార్టీకి ఒక హింసాయుత మార్గాన్ని సూచిస్తూ చారు మజుందార్ ఒక్క సైదాంతిక భూమికను రూపొందించాడు. అతడు రాసిన 8 డాక్యుమెంట్లు చారిత్రాత్మకమని భావించిన అతివాద కమ్యూనిస్టులు ఒక ఆచరణాత్మక హింసా పోరాటాన్ని రూపొందించుకున్నారు. 1969 నుండి ఈ కమ్యూనిస్టు సాయుధ పోరు మనదేశంలో పని చేస్తూ ఉన్నది. పశ్చిమ బెంగాల్ నుండి నేరుగా ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళంలో తన అడుగులను ముద్రిస్తూ తెలంగాణ, ఛత్తీస్ గడ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, బీహార్, ఝార?ండ్ నుండి ఇటు కర్ణాటక రాష్ట్రాలకు ఈ సాయుధ పోరు విస్తరింపజేయబడింది.సిపిఐ నుండి విడివడ్డ సిపిఎం. అందులో నుండి విభేదించి రూపొందిన సిపిఐ ఎంఎల్ ఎన్నెన్నో రూపాలు మార్చుకుంటూ చివరగా సిపిఐ మావోయిస్టు పార్టీగా ఇప్పుడు పని చేస్తున్నది.

**– చైనా దేశానికి చెందిన “మావో” పేరును తమ పార్టీకి పెట్టుకోవడం దేశానికే అవమానం**

మొదట “వర్గ శత్రు నిర్మూలన” అనే కార్యక్రమముతో ఈ నక్సలైట్లు ఇష్టారాజ్యంగా తమ వ్యతిరేకులను చంపుతూ వచ్చారు.ఆయుధమే తమ బలం గా సైద్దాంతిక కార్యక్రమము రూపొందించుకున్న నక్సలైట్లకు, ఆ ఆయుధమే ఒక బలహీనతగా మారింది. సిద్ధాంతము పక్కకు తప్పుకొని ఆయుధం మాత్రమే ప్రధానంగా మారిన ఒక పార్టీగా మావోయిజం అవతరించింది.“హింసకు ప్రతి హింస” అంటూ బయలుదేరిన రాడికల్ వాదం,అభద్రతా భావం లోనికి ప్రవేశించింది. అలా నక్సలిజం భయం గుప్పిట్లో చిక్కుకున్నది.హింసా కార్యక్రమమే సిద్ధాంతంగా మలుచుకున్న నక్సలైట్లు చివరికి తమ అనుచరులను కూడా నమ్మలేని స్థితికి చేరుకున్నారు. అక్కడే ఇన్ ఫార్మర్లు అంటూ కోవర్టులు అంటూ తమ వారినే చంపుకునే ఒక అవాంఛిత కార్యక్రమం ఆచరించారు. దానివల్ల నక్సలైట్ పార్టీ లోనే పుట్టిన అంతర్గత శత్రువుల వల్ల తమ ఉద్యమం సవాళ్లను ఎదుర్కొంటూ వచ్చింది. ఇన్ ఫార్మర్లు,కోవర్టుల వల్ల ఎందరో అజ్ఞాత నక్సలైట్లు చంపబడ్డారు.

**–ఈ కొత్త ఉపద్రవం దాటడానికి “వర్గ శత్రు నిర్మూలన” అనే కార్యక్రమము నుండి “సాయుధ పోరు” అనే ఒక కొత్త ప్రతిపాదన చేసుకున్నది నక్సలిజం**

ఎప్పుడైతే సాయుధ పోరు అనే భావన రూపొందిందో అప్పుడే నక్సలిజం ఒక గిరి గీసుకొని తనకు తానే బంధించబడ్డది.ఈ ఆయుధం ఒక అలంకారంగా, ఒక ఫ్యాషన్ గా, ఒక ఆరాధనగా మారిపోయి ప్రజా సమస్యలనుండి పక్కకు జరిగిన మావోయిజానికి సామాన్య జనం దూరంగా జరిగారు. నక్సలైట్ల ఆయుధం ఆలోచనను నశింపజేసింది. సిద్ధాంత కార్యాచరణను ఆయుధం తొక్కేసింది.నక్సలైట్ల ఆయుధం చివరికి నక్సలైట్లనే భయం లోకి నెట్టేసింది.అప్పుడే ఈ నక్సలిజం గా పిలువబడే మావోయిజం తమకంటూ ఒక ప్రత్యేక ప్రాంతాన్ని ఒక విముక్తి ప్రాంతాన్ని సృష్టించుకోవాలనే కార్యక్రమాన్ని ఆచరించింది. దాని కొరకు దండకారణ్యం లో అబూజ్ మడ్, కర్రె గుట్టలను తమ కోటలుగా భావించుకుంటూ మావోయిస్టులు ఒక ప్రత్యేక ప్రతిపత్తి తమకు ఉందంటూ భావించుకుంటూ వచ్చారు.

**– ఆరు రాష్ట్రాల మధ్యలో ఉన్న దండకారణ్యాన్ని ఒక ప్రత్యేక ప్రాంతంగా ఒక రాజ్యాంగ భావిస్తూ వచ్చారు**

అడవుల్లో, గుట్టల్లో ఏర్పడ్డ సహజ గుహలు, దండకారణ్యంలోని లోతట్టు ప్రాంతాలు తమ కోటలుగా మార్చుకొని దానికి “జనతన సర్కార్” అని పేరు పెట్టుకుని ప్రత్యేక పాలనను రూపొందించుకున్నారు. ఈ సహజ గుహలతో పాటు మావోయిస్టులు బంకర్లను కూడా ఏర్పరచుకున్నారు.ఈ జనతన సర్కార్ సమాంతర ప్రభుత్వంగా మారి చివరికి భారత రాజ్యాంగాన్ని, చట్టాలను తృణీకరిస్తూ వచ్చింది.తమకంటూ ఒక విముక్తి సైన్యము, గెరిల్లా సైన్యం, మిరిటరీ అని, మిలీషియా అని పేరు పెట్టుకుని భారతదేశంలో ఒక స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించుకున్నామని భావిస్తూ వచ్చారు.దాన్ని నమ్మించడానికి




రకరకాల ఎత్తుగడలు కార్యక్రమాలు చేస్తూ వచ్చారు.కాశ్మీర్ రాష్ట్రానికి అప్పుడు ప్రత్యేక హోదాను కల్పిస్తూ రూపొందించిన ఆర్టికల్ 370 లాగా, మావోయిస్టులు కూడా ఈ దండకారణ్య ప్రాంతంలోని తమ రాజ్యానికి ఒక ప్రత్యేక ప్రతిపత్తి ఉందని భావిస్తూ వచ్చారు.మావోయిస్టు అనుకూల స్వయం ప్రకటిత మేధావులు కొందరిని ఈ ప్రచారానికి వాడుకున్నారు. స్వతంత్రము తరువాత మన భారత దేశము రూపొందించుకున్న రాజ్యాంగాన్ని అవహేళన చేస్తూ “కమ్యూనిస్టు శ్రేయో రాజ్యం” అంటూ తమ సొంత ఎజెండాను ప్రచారం చేస్తూ తమ ఉద్యమానికి ఒక గ్లామర్ కల్పిస్తూ, ఆరాధనను జోడిస్తూ వచ్చారు. భారతదేశాన్ని ఏలిన ముస్లింలు, ఆంగ్లేయులు తమ అసంపూర్ణ ఎజెండాను అమలు చేయడానికి కొందరు మానస పుత్రులను ఇంకా చెప్పాలంటే బానిస పుత్రులను ఈ దేశంలో ప్రోత్సహిస్తూ వచ్చారు. మన దేశము నుండి విడిపోయి పాకిస్తాన్ బంగ్లాదేశ్ గా రూపొందిన రెండు దేశాలతో పాటు ఈ మావోయిస్టుల పితృదేశం చైనా ఒకపక్క, సామ్రాజ్యవాద దేశం అమెరికా ఇంకో పక్క మన దేశంపై తమ కుట్రలను,కుతంత్రాలను అమలు చేస్తూ వచ్చారు.ఈ మావోయిస్టులు కూడా ఈ శక్తుల అండతో అంతర్గతంగా దేశంలో ఒక ఉద్యమం అంటూ దేశ వ్యతిరేక శక్తుల మాదిరిగా అంతర్గత శత్రువులుగా మారిపోయారని మేధావులు స్పష్టంగా ప్రకటిస్తూ వచ్చారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధానమంత్రి దివంగత శ్రీ మన్మోహన్ సింగ్

Maoists are the single biggest internal security challenge.’ for India’ అని ప్రకటించారు.

నక్సలిజం ఆవిర్భవించిన తరువాత.. సాయుధ పోరాటం చేస్తూ వస్తున్న ఈ కాలంలో వేలమంది ఈ నక్సలిజానికి బలైపోయారు.ఒకరకంగా నక్సలైట్లు అసహనవాదులు. అసహనవాదులు మాత్రమే కాదు అరాచక వాదులు అనే అభిప్రాయం కూడా ఈ దేశంలో బలంగా ఉన్నది. తమ హింస మార్గాన్ని వ్యతిరేకించే వారిని నక్సలైట్లు శత్రువులుగా భావించి హత్యలు చేసే స్థితికి దిజారారు. ఇది అసహనం కాక ఇంకేమిటి? తమ సిద్ధాంతాన్ని తమ ఆలోచనను వ్యతిరేకించే వారిని చంపే హక్కు తమకుందని ఈ మావోయిస్టులు భావించడము రాజ్యాంగ వ్యతిరేకము, చట్ట వ్యతిరేకము. కాశ్మీర్ లోని జిహాదీ శక్తుల పోరాటాన్ని, ఈశాన్య భారతంలోని జాతి పోరాటాల సాయుధ రూపాన్ని తమకు కూడా అనుభవించుకున్న ఈ మావోయిస్టులు ఇప్పుడు శాంతి అంటూ ఒక కొత్త రాగాన్ని ఆలపించడం సమాజం గమనిస్తున్నది. కేంద్ర ప్రభుత్వము దేశం బయట దేశం లోపల ఎదురవుతున్న సవాళ్లను రూపుమాపాలని ఒక ప్రణాళిక సిద్ధం చేసుకున్నది.

ప్రజలు కూడా ఈ ఆకాంక్షతోనే అధికారం అప్పగించారని భావిస్తున్న కేంద్ర ప్రభుత్వం దేశం చుట్టూ అలుముకున్న కుట్రలను ఛేదిస్తూ వస్తున్నది.దేశంలోపల సవాలు విసురుతున్న అంతర్గత శత్రువులను కూడా ఛేధించాలని, నిర్మూలించాలని పనిచేస్తున్నది.

ఇది కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు అప్పగించిన బాధ్యత. ఇది ప్రభుత్వం యొక్క రాజ్యాంగబద్ధం, చట్టబద్ధం అయిన హక్కు.

నక్సలైట్లు రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తూ చట్టాన్ని ధిక్కరిస్తూ హత్యలు చేసే హక్కు తమకుందని భావిస్తూ, ప్రభుత్వం మాత్రము తమపై ఎలాంటి అణచివేత, ప్రతిబంధకాలు విధించకూడదని భావించడము తప్పు. అలా డిమాండ్ చేసే హక్కు మావోయిస్టులకు లేదు. దానికి రాజ్యాంగం పేరు చెప్పి మనుగడ సాధించాలనుకోవడం చెల్లదు.

శాంతి చర్చలు అంటూ నక్సలైట్ల ఫ్రంటల్ ఆర్గనైజేషన్లు, అర్బన్ నక్సల్ కార్యకర్తలు గత కొన్ని రోజులుగా ప్రభుత్వము శాంతి చర్చలకు ఒప్పుకోవాలని, నక్సలైట్ లతో చర్చలు జరపాలని సమావేశాలు, సింపోజియములు నిర్వహించారు.

**ఈ కార్యక్రమానికి “పౌర సమాజం” పిలుపు అంటూ పేరు పెట్టారు.**

## – సాయుధ పోరాటం ఎందుకు? శాంతి చర్చలు ఎందుకు?

పౌర సమాజం ద్వారా, మావోయిస్టు పార్టీ ద్వారా శాంతి చర్చలకు లేఖలు విడుదల చేస్తూ ఆపరేషన్ కగార్ పేరుతో ప్రభుత్వ వేటను ఆపాలని తీవ్రంగా కృషి చేశారు.

రాజ్యాంగ వ్యతిరేక శక్తులతో, హింసా వాదులతో చర్చలు లేవంటే లేవని కేంద్ర ప్రభుత్వం ఖరాఖండిగా ప్రకటిస్తూ వచ్చింది.

లెక్కలేనంత హింసను సమాజం పై రుద్దిన మావోయిజం, వేలాది హత్యలు చేసిన మావోయిజం తమపై మాత్రం ఎలాంటి హింస చేయకూడదని కోరడం సామాన్యులు కూడా గమనించారు. మావోయిస్టుల తీరును నిరసిస్తున్నారు.

మావోయిస్టుల ప్రజా సంఘాల కార్యకర్తలు, పౌర హక్కుల కర్యకర్తలు సుందరయ్య విజ్ఞాన కేంద్రం లాంటి కమ్యూనిస్టు అడ్డాల్లో ఈ కగార్ ఆపరేషన్ ఆపాలంటూ, కేంద్ర ప్రభుత్వం చర్చలకు దిగిరావాలంటూ పిలుపునిస్తూ వచ్చాయి. మావోయిస్టులకు ఒక రక్షణ కవచంగా, లీగల్ కవచంగా పనిచేస్తున్న అర్బన్ నక్సలైట్లుగా ముద్రపడ్డ శక్తులకు ధీటుగా “మావోయిస్టులను వ్యతిరేకించే వాళ్లు” కూడా సమావేశాలు, సింపోజియములు నిర్వహించారు. కర్రె గుట్టల్లోని ఎర్రసైన్యం ఎర్రకోటపై ఎర్రజెండా ఎగరేసి ఎర్ర రాజ్యం స్థాపించాలనుకున్న తమ కల కల్లలుగా మారిపోతున్నదని ఈ మావోయిస్టు శక్తులు, వారి అనుచరులు “ఆపరేషన్ కగార్” ఆపాలని హైదరాబాదు నుండి ఢిల్లీ వరకు తమ ప్రయత్నాలను తాము చేశారు.దేశ సరిహద్దుల అవతల నుండి శత్రువులు ఒకపక్క మన దేశంపై యుద్ధం చేస్తుంటే, దేశంలోపల ఈ మావోయిస్టులు మన దేశంపై ఇంకో యుద్ధం చేస్తున్నారు. మావోయిస్టులకు ఈ దేశంపై నిజంగా ప్రేమ ఉంటే తమ ఆయుధాలతో భారత రక్షణ బలగాలతో కలిసి దేశ రక్షణకు కదలాలి. ఒకపక్క దేశ శత్రువులు, ఇంకోపక్క దేశంలోపల ఈ మావోయిస్టులు రక్షణ బలగాలతో పోరాటం చేస్తుంటే ప్రభుత్వం ఏమి చేయాలి?

ఆయుధ హింస, సాయుధ పోరు చేస్తున్న మావోయిస్టులు తమకు రాజ్యాంగ హక్కులు వర్తించాలని కోరుకోవడం హాస్యాస్పదమే.

రాజ్యాంగాన్ని చట్టాన్ని గౌరవించే వారికే ఈ హక్కు ఉంటుంది.

రాజ్యాంగ హక్కులను చట్టపరమైన హక్కులను రక్షించడానికి మన దేశ కోర్టులు సిద్ధంగా ఉన్నాయి. మావోయిస్టుల కార్యక్రమాలు చట్టబద్ధమైనప్పుడు తప్పకుండా కోర్టులు రక్షణ కల్పిస్తాయి.కోర్టులను, చట్టాన్ని, రాజ్యాంగాన్ని రూపుమాపాలనే కార్యక్రమముతో పనిచేస్తున్న మావోయిస్టులు తమకు మాత్రం చట్టపరమైన రక్షణ కావాలని కోరుకోవడం సమంజసం అవుతుందా అనే ప్రశ్న ఇప్పుడు సర్వత్రా వినిపిస్తున్నది.

కాశ్మీర్ లోని “పహల్గాం గుట్టల్లో” అమాయక భారత పర్యాటకులను చంపిన జిహాదీ సాయుధులపై మన భారత సైన్యం దేశ సరిహద్దులు దాటి, దాడి చేసి ఈ జీహాద్ మూకల ఫ్యాక్టరీలను, వారి నాయకులను బహిరంగంగా చంపేసింది.

ప్రపంచం మన భారత దేశ చర్యలను గమనించింది. భారత ప్రజలను రక్షించుకునే హక్కు మన ప్రభుత్వానికి ఉందని ప్రపంచం భావించింది.

అదేవిధంగా దేశంలోపల అర్థం లేని పోరు చేస్తూ, దానికి సాయుధ పోరు, సైదాంతిక పోరు, తిరుగుబాటు, విప్లవం అంటూ రకరకాల పేర్లతో హింస చేసే మావోయిస్టులకు రాజ్యాంగ హక్కులు ఉండవు, ఉండకూడదు.

మావోయిస్టులు తమకు హింస చేసే హక్కు ఉందని భావించినప్పుడు, ఇతర పోరాటాలు ప్రతి తిరుగుబాటు కూడా చట్టబద్ధమే అవుతుంది.

అప్పుడు ఈ భారత రాజ్యాంగం ఎందుకు? మన రక్షణ బలగాలెందుకు?

మన చట్టాలు ఎందుకు? మన కోర్టులు ఎందుకు?

నక్సలైట్లు నిజంగా శాంతిని కోరుకునే వాళ్లయితే చత్తీస్ గడ్ లో 74 మందిని చంపిన మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ గంగన్న అలియాస్ బసవరాజ్ హత్యలను మావోయిస్టులు సమర్థిస్తారా?

నంబాల కేశవరావు హత్యలు సమర్థనీయమని మావోయిస్టులు అనగలరా?

ఇంకోసారి 27 మందిని, అలాగే ఎంతోమందిని చంపిన సంఘటనల్లో సూత్రధారి నంబాల కేశవరావు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు పై తిరుపతి అలిపిరిలో హత్యాయత్నం చేసిన నంబాల కేశవరావు కి హత్యలు చేసే పేటెంట్ హక్కు ఎవరిచ్చారు?

అదేవిధంగా ఎందరో నక్సలైట్ నాయకులు ఎన్నెన్నో దాడులు, ఎన్నెన్నో హత్యలు చేసిన వారు తమపై మాత్రము ఎలాంటి హింస ప్రయోగించకూడదని, ఇది రాజ్యాంగ వ్యతిరేకమని, ఇది పౌరహక్కులకు వ్యతిరేకమని అరచి గీ పెట్టడం అర్థంలేని విషయం.

**– భారత రాజ్యాంగం మన దేశ సార్వభౌమత్వాన్ని దేశ అంతర్గత ప్రజాశాంతిని కాపాడే బాధ్యత ప్రభుత్వాలకు కల్పించింది. భారత రక్షణ బలగాల పని కూడా అదే**

“ఆపరేషన్ కగార్” లాంటి కార్యక్రమాలు చేపట్టి శాంతిని నెలకొల్పడం ప్రభుత్వాల బాధ్యత. భారత కేంద్ర ప్రభుత్వం బహిరంగంగా ప్రకటించి చేపట్టిన ఆపరేషన్ కగార్ ఏ రకంగానూ చట్ట వ్యతిరేకమని ఏ కోర్టు అనలేదు, చట్టం కూడా అనలేదు, రాజ్యాంగం కూడా అనదు. దేశ అంతర్గత శాంతిని కాపాడడం, తద్వారా భారత రాజ్యాంగాన్ని కాపాడడం ప్రభుత్వాల విధి.తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ చత్తీస్ గడ్ రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న పర్వత శ్రేణులు కర్రెగుట్టలు.

**–ఈ కర్రెగుటల్లో మావోయిస్టులు తమ స్థావరాలను ఏర్పరచుకొని మారణాయుధాలను పట్టుకొని ప్రభుత్వ బలగాలు మా వైపు రాకూడదు అనే ధోరణి దేశ వ్యతిరేకం**

కర్రెగుటల్లో మందు పాతరలు, ప్రెజర్ బాంబులు పాతిపెట్టి అటువైపు రక్షణ బలగాలు రాకూడదనే హుంకరింపు చెల్లదు. చట్టాన్ని గౌరవించే వారికే చట్టబద్ధ హక్కులు ఆశించే అవకాశం ఉంటుంది. దండ కారుణ్యంలో సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతూ దానికి “జనతన సర్కార్” అని పేరు పెట్టి భారత ప్రభుత్వం రక్షణ బలగాలు ఆ వైపు రాకూడదు అనే ఆంక్షలు పెట్టే హక్కు మావోయిస్టులకు లేదు.మావోయిస్టుల ఈ వైఖరి దేశ వ్యతిరేకం రాజ్యాంగ వ్యతిరేకం. మావోయిస్టులు నిజంగా శాంతిని కోరుకునే వారే అయితే చర్చలెందుకు? దానికి ప్రభుత్వం ఎందుకు దిగిరావాలి?

**– రాజ్యాంగ వ్యతిరేకంగా చట్ట వ్యతిరేకంగా ఆయుధాలు చేతపట్టిన నక్సలైట్లు తమకు తాము తమ పోరాటాన్ని విరమించుకొని శాంతి మార్గానికి మల్లే అవకాశం మావోయిస్టులకు ఉన్నది !!**

సిపిఐ, సిపిఎం పార్టీలు పార్లమెంటరీ ప్రజాస్వామ్య పద్ధతిలో అధికారాన్ని నడిపిన, నడుపుతున్న విషయం మనం చూస్తున్నాము.వీళ్లు కూడా మొదట కమ్యూనిస్టులే కదా! ఈ కమ్యూనిస్టు పార్టీల నుండి విడివడి ఏర్పడ్డ మావోయిస్టు నక్సలైట్ పార్టీ కూడా పార్లమెంటరీ ప్రజాస్వామ్య పద్ధతిలో ఈ దేశంలో ప్రజా పాలనలో ఎన్నెన్నో మార్పులు తెచ్చే అవకాశం పుష్కలంగా ఉంది.

ఎన్నికలను బహిష్కరించమని పిలుపునిచ్చిన అప్పటి పీపుల్స్ వార్ పార్టీ, ఇప్పటి మావోయిస్టు పార్టీ కొత్తగా ప్రజాస్వామిక విలువలను ప్రభుత్వాలకే బోధించడం ఒక వింత.

పార్లమెంటరీ ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల్లో పోటీ చేసిన ఎందరో నాయకులను చంపిన ఘనత ఈ మావోయిస్టులది. మావోయిస్టులకు ప్రజలను చంపే అధికారం ఎవరిచ్చారు?

**– ప్రజాస్వామ్యానికి ఊపిరి లాంటి ఎన్నికల ప్రక్రియను వ్యతిరేకించి అడ్డగించి, ఆటంకాలు కల్పించి, అవాంతరాలు సృష్టించిన నక్సలైట్లు ఇప్పుడు తమకు ప్రజాస్వామిక హక్కులు కావాలని కోరడం ఏ రకంగానూ సమంజసమైన డిమాండ్ కాదు**

నక్సలైట్లుగా పిలవబడుతున్న మావోయిస్టులు భేషరతుగా తమ సాయుధ పోరును విరమించి, తమ అభిప్రాయాలను డిమాండ్లను ప్రజల ముందు ఉంచి, ప్రభుత్వము ముందు ఉంచి ప్రజాస్వామిక హక్కులను కోరడం సమంజసం. నక్సలైట్ల న్యాయమైన డిమాండ్ గనుక ప్రజలకు నచ్చితే ఈ ప్రజలే రాష్ట్రాల్లో కేంద్రంలో మావోయిసుల ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తారు.అప్పుడు మావోయిస్టులు తమ ఎజెండాను రాజ్యాంగ బద్ధంగా అమలు చేయవచ్చు.ప్రభుత్వాలు హింసను ప్రయోగించినప్పుడు శాంతి చర్చలు అంటూ ఎత్తుగడలు ప్రదర్శించే మావోయిస్టుల డిమాండ్ ఒప్పుకోమంటూ కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించింది. పౌర సమాజంగా చెప్పుకునే అర్బన్ నక్సలైట్లు గాని, మేధావులుగా చెప్పుకునే మావోయిస్టు అభిమానులు గాని, పౌర హక్కుల కార్యకర్తలుగా ప్రకటించుకునే వారుగాని, మావోయిస్టులతో నేరుగా మాట్లాడి సాయుధ పోరును విరిమింపజేసి శాంతి స్థాపనకు కృషి చేయాలి. శ్రీలంకలోని ఎల్ టి టి ఈ అనే సంస్థతో సాయుధ పోరు చేసే మెలకువలను నేర్చుకున్న నక్సలైట్లు ఇప్పుడు శాంతి శాంతి అంటూ ప్రవచించడం వింత కాక మరేమిటి? ప్రపంచంలో ఎక్కడ ఏ రకమైన సాయుధ పోరు జరుగుతున్నదో అక్కడి సంస్థలతో మావోయిస్టులు నక్సలైట్లు సంబంధాలు పెట్టుకున్న విషయం జగత్ విధితం. చివరికి పాకిస్తాన్ లోని ఇస్లామిక్ జిహాది సాయుధ శక్తులతో కూడా మావోయిస్టులకు ఆయుధ సహకారం ఉందనే విషయం జగద్వితము. లిబియా, చైనా, పాలస్తీనా, నేపాల్ లోని మావోయిస్టు సాయిధ శక్తులతో మన భారత నక్సలైట్లకు ఉన్న సంబంధం కూడా అందరికీ తెలిసిందే.

**– నేపాల్ నుంచి కేరళ వరకు రెడ్ కారిడార్ సృష్టించి ఎర్ర రాజ్యం స్థాపిస్తామని గతంలో వెర్రి ప్రకటనలు చేసిన మావోయిస్టులు ఇప్పుడు శాంతి చర్చలకు ప్రభుత్వం అంగీకరించాలని కోరడం వింత గాక మరేమిటి?**

ప్రొఫెసర్ హరగపాల్, జస్టిస్ చంద్ర కుమార్ లాంటి వ్యక్తులు శాంతి చర్చలు జరుపుదాం, ప్రభుత్వము అంగీకరించాలి అంటూ దేశవ్యాప్తంగా తమ అనుకూల మీడియాతో ప్రచారం చేశారు.అంతర్జాతీయ సాయుధ సంబంధాలు కలిగిన మావోయిస్టులు పాకిస్తాన్ తో, బంగ్లాదేశ్ తో శాంతి చర్చలకు కూడా ప్రయత్నం చేయవచ్చు కదా! జస్టిస్ చంద్ర కుమార్ లాంటి న్యాయమూర్తులు తమకున్న విజ్ఞతతో, చట్టబద్ధమైన పరిజ్ఞానంతో, రాజ్యాంగ పరిజ్ఞానంతో, తమకున్న అంతర్జాతీయ వ్యవహారాల అవగాహనతో ఈ దేశం లో శాంతి స్థాపనకు కృషి చేయవచ్చు.

ఒకపక్క దేశం యుద్ధంలో తల మునకలై ఉంది. ఈ సమయంలో, మావోయిస్టుల ఈ సాయుధ పోరు తో దేశ వనరులు శక్తి నిర్వీర్యం అవ్వదా?

ఇదేనా మావోయిస్టులు కోరుకునేది? తమకు తాము విశ్వ మానవులమని ప్రకటించుకునే కమ్యూనిస్టులు పాకిస్తాన్ చైనా బంగ్లాదేశ్ లాంటి మన పొరుగు దేశాలను శాంతితో వ్యవహరించమని చెప్పలేరా? ప్రపంచ కార్మికులను ఏకం చేసే కమ్యూనిస్టు శక్తులు భారత్ పాకిస్తాన్ లను శాంతిగా ఉండడానికి ప్రయత్నించకూడదా?

**– శాంతి లేని సమాజం స్మశానం లాంటిది**

శాంతి స్థాపన కొరకు ప్రభుత్వం తప్పకుండా ఆయుధం ప్రయోగించే హక్కు కలిగి ఉన్నది. ఆ హక్కును భారత రాజ్యాంగం ఇచ్చింది. చట్టం కూడా ఆ హక్కును సమర్థిస్తున్నది. ప్రొఫెసర్ హరగోపాల్, జస్టిస్ చంద్రకుమార్ లాంటి మేధావులు నిజంగా శాంతిని కోరుకుంటే ఎలాంటి షరతులు లేని చర్చలు జరపడానికి మావోయిస్టులను ఒప్పించాలి.

**– ఏ ప్రభుత్వాన్ని అడిగి మావోయిస్టులు సాయుధ పోరు చేస్తున్నారు?**

**– ఆ సాయుధ పోరును విరమించడానికి ప్రభుత్వంతో చర్చలెందుకు?**

మావోయిస్టుల ఫ్రంటల్ ఆర్గనైజేషన్స్, అర్బన్ నక్సల్ మేధావులు, పౌర హక్కుల నాయకులు, కమ్యూనిస్టు రచయితలు, విద్యావంతులు, ప్రజా సంఘాలు అందరూ కలిసి మావోయిస్టులను ఆయుధాలు విడిచిపెట్టి శాంతి మార్గంలో ప్రజా జీవనంలో కలిసిపోవాలని చెప్పాలి. ఇంకా చెప్పాలంటే మన భారతదేశానికి ఆగర్భ శత్రువులైన పాకిస్తాన్ చైనా బంగ్లాదేశ్ లాంటి విదేశీ శక్తులకు వ్యతిరేకంగా దేశంలోపల ఒక ఉద్యమాన్ని నిర్మించాలి. అశాంతితో రగిలిపోయే మావోయిస్టుల వల్ల శాంతి ఎప్పటికి స్థాపించబడదు.ఆయుధంతో అస్సలే శాంతి నెలకొనదు.

**– తథాగతుడు గౌతమ బుద్ధుని శాంతి మార్గంలో సమాజాన్ని నడిపించడానికి దేశంలోపల శక్తులన్నీ ఒక్కటై కృషి చేయాలి**

సాయుధ పోరు ఏ రూపంలో ఉన్న వ్యతిరేకించాల్సిందే.

అది జిహాదీలైనా, నక్సలైట్లయినా ఇంకెవరైనా సరే సాయుధ పోరును ఈ దేశ రాజ్యాంగం అనుమతించదు.

**భారత రాజ్యాంగం వర్ధిల్లాలి.**
**భారతదేశంలో శాంతి నెలకొనాలి.**
**మావోయిస్టులు సాయుధ పోరు విరమించాలి.**

# గర్భిణి స్త్రీలకు ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు

**– జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి

గర్భిణి స్త్రీలకు ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగుండం వైద్య కళాశాలను పరిశీలించి గర్భిణీ స్త్రీలకు అందించే వైద్య సేవల పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రులలో అధికంగా ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సాధారణ ప్రసవాల వైపు గర్భిణీ మహిళలను ప్రోత్సహించాలని, వారికి అవసరమైన కౌన్సిలింగ్ అందించాలని కలెక్టర్ తెలిపారు. మొదటి కాన్పులో సిజేరియన్ ఆపరేషన్లు వీలైనంత వరకు తగ్గించాలని కలెక్టర్ తెలిపారు. గర్భిణీ స్త్రీల ఏ.ఎన్.సి రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా 100% పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. గర్భిణీ స్త్రీలకు టీకాలు పూర్తి స్థాయిలో వేయాలని, కాన్పుకు దగ్గరగా ఉన్న గర్భిణి మహిళలను ఆశా వర్కర్ల ద్వారా ఫాలో అప్ చేయాలని, పెయిన్ రాగానే సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం జరిగేలా చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు. గోదావరిఖని వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న జనరల్ ఆసుపత్రిలో సీనియర్ వైద్యులు అందుబాటులో ఉన్నారని, కాంప్లికేటెడ్ కేసులకు సైతం ఇక్కడ చికిత్స అందించే అవకాశం ఉందని అన్నారు. అంతర్గాం, పుట్నూరు, గోదావరిఖని, రామగుండం పరిసర ప్రాంతాల్లో ఆశా వర్కర్ల ద్వారా జనరల్ ఆసుపత్రిలో ఉన్న వసతులను వివరిస్తూ ఇక్కడ అధికంగా ప్రసవాలు జరిగేలా చూడాలని, ప్రైవేట్ నర్సింగ్ హోమ్ లోకి వెళ్లి ప్రజలు డబ్బులు వృధా చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో టిఫా స్కానింగ్ యంత్రం కూడా అందుబాటులోకి తీసుకొని వచ్చామని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని, ప్రతి నెలా రామగుండం ప్రాంతంలో ప్రభుత్వ వైద్య కళాశాల పరిధిలోని ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలపై ప్రచారం కల్పించాలని అన్నారు. ప్రజలు జనరల్ ఆసుపత్రిలో అందించే వైద్య సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం గోదావరిఖనిలో నిర్మాణం జరుగుతున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను సందర్శించి నిర్ణీత గడువు లోగా పూర్తి చేయాలనీ, మరియు శారదా నగర్ లోని నర్సింగ్ కళాశాలను సందర్శించి, తరగతి గదులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమ బిందు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అన్న ప్రసన్న కుమారి, హెచ్. ఓ.డి.అరుణ, ఆర్.ఎం.ఓ డాక్టర్ రాజు, డాక్టర్

# గురుకుల ఇంటర్ కళాశాలల మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి:

**– జార్జి రెడ్డి పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు నరేష్ రత్న:**



కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి

గురుకుల ఇంటర్ కళాశాలల మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలనీ జార్జి రెడ్డి పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు నరేష్ రత్న అన్నారు.రాష్ట్రంలోని 12 సాంఘీక సంక్షేమ గురుకుల ఇంటర్ కళాశాలలను ఎత్తివేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలనీ జార్జి రెడ్డి పి డి ఎస్ యు విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నరేష్ రత్న ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 11 జిల్లాల్లో దాదాపు వందలాది మంది పేద విద్యార్థులు విద్యని అభ్యసిస్తున్నారని,తాజాగా రాష్ట్ర ప్రభుత్వ తీసుకున్న నిర్ణయం వందలాది మంది పేద విద్యార్థులకి విద్యని దూరం చేసేలాగా ఉన్నదని అని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇటీవల ప్రకటించిన ఇంటర్ ఫలితాలలో జెఇఇ, ఎప్ సెట్ ఫలితాలలో గురుకుల ఇంటర్ విద్యార్థులు ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలతో సమాన స్థాయిలో రాణించారని, ర్యాంకులు ,మంచి ఫలితాలు, మార్కులు సాధించారని అన్నారు. ప్రభుత్వ విద్యా బలోపేతం చేయాల్సిన ప్రభుత్వాలు పేదల విద్యా సంస్థలను పలు కారణాలతో రద్దు చేయడం అన్యాయమనీ అన్నారు. అధిక నిధులు, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ లను సకాలంలో పూర్తి స్థాయిలో భర్తీ చేస్తే అడ్మిషన్ల కోసం విద్యార్థులు బారులు తీరుతారని అన్నారు.ఆ సాకు చూపించి ప్రభుత్వ విద్యా సంస్థల రద్దు అంటే కార్పోరేట్ విద్యా సంస్థల ముందు మోకరిల్లడమే అని ఎద్దేవా చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ఆశను ఆసరాగా చేసుకుని ప్రైవేట్ కార్పొరేట్ జూనియర్ కళాశాలలు లక్షల రూపాయల ఫీజులు దోపిడీ చేస్తున్నాయని, ఈ విద్యా సంస్థల దోపిడి నుండి పేదలు రక్షణ పొందాలంటే తప్పనిసరిగా గురుకుల కళాశాలలు కొనసాగించాలని కోరారు. సరైన వసతులు, నాణ్యమైన భోజన సౌకర్యం అందిస్తే అందిస్తే విద్యార్థుల సంఖ్య మరింత పెరుగుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా విద్యాశాఖను పర్యవేక్షిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం విద్యను మరింత ప్రోత్సహించాల్సింది పోయి నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నారని ఇది సరైన కాదని అవేదన వ్యక్తం చేశారు. తక్షణమే గురుకుల విద్యా సంస్థల రద్దుపై ప్రభుత్వ నిర్ణయాలను వాపస్ తీసుకోవాలి డిమాండ్ చేశారు. లేనియెడల అన్ని విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల సమన్వయంతో ఐక్య ఉద్యమాలను నిర్వహిస్తామని తెలిపారు.

# మహిళలు అన్నింటిలో భాగస్వాములు కావాలి.. మున్సిపల్ కమీషనర్ మహమ్మద్ అయాజ్

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మే 23**

జమ్మికుంట : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉమెన్ ఫర్ ట్రీస్ అమృత్ 2.0 లో భాగంగా మహిళలు అన్ని కార్యక్రమాలలో భాగస్వాములు అయి ఆర్థిక పురోగతిని సాధించాలని మున్సిపల్ కమీషనర్ మహమ్మద్ ఆయాజ్ అన్నారు. శుక్రవారం జమ్మికుంట పట్టణంలోని నాయిని చెరువు ప్రాంతంలో మున్సిపల్ కమీషనర్ మహమ్మద్ అయాజ్, మెప్మా డీఎంసీ శ్రీవాణి, మెప్మా ఇంచార్జి టి.ఎం.సి. జ్యోతి, సీ.ఎల్ ఆర్పీ మంజులలు పరిశీలించి, సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమీషనర్ మహమ్మద్ అయాజ్, మెప్మా డీఎంసీ శ్రీవాణిలు మాట్లాడుతూ మహిళా సంఘంలోని సభ్యులు రానున్న వర్షాకాలంలో మొక్కలు నాటి, జియో ట్యాగ్ ద్వారా వాటిని విధిగా సంరక్షించాలన్నారు.







మొక్కలు సక్రమంగా పెరిగే విధంగా పూర్తి భాద్యత సంఘ సభ్యులదే ఉంటుందని అయన అన్నారు. వర్షాకాలంలో కానీ, చలి కాలంలో కానీ, ఎండ కాలంలో కానీ వాటిని సంరక్షించి, వాటి పరిరక్షించాలని అయన పిలుపు నిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రానున్న రోజుల్లో నాయిని చెరువును మినీ ట్యాంక్ బండ్ గా ఏర్పాటు చేయబోతున్నట్లు కమిషనర్ మహమ్మద్ అయాజ్ అన్నారు. ఈ కార్యక్రమంలో అర్పిలు, సంఘ సభ్యులు, ఈ ఈ శ్రీ కాంత్, పలువురు పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్యం పట్ల కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో ఉంది..ప్రణవ్.

కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మే 23

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఆరోగ్యం పట్ల,పరిస్థితి బాగోలేక ఇబ్బందుల పాలైనవారికి సీఎంరిలీఫ్ ఫండ్ చెక్కుల ద్వారా ఆదుకుంటుందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.శుక్రవారం నాడు హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జమ్మికుంట పట్టణ,మండల,వీణవంక,ఇళ్ళందకుంట మండలాలకు చెందిన 86 మంది లబ్దిదారులకు 30,44,000/- విలువ చేసే చెక్కులను లబ్దిదారులకు అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ లబ్ధిదారులు చెక్కులను వెంటనే బ్యాంక్ లో డిపాజిట్ చేసుకోవాలని,తమ దగ్గరికి వచ్చిన వెంటనే చెక్కులను పంపిణీ చేస్తున్నామని అన్నారు.రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి





లబ్దిదారునికి అందజేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జమ్మికుంట,వీణవంక,ఇళ్ళంధకుంట మండలాలకు చెందిన మండల అధ్యక్షులు,పట్టణ అధ్యక్షుడు,ఇళ్ళందకుంట దేవాలయ చైర్మెన్,డైరెక్టర్లు,సీనియర్ నాయకులు,కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# జిడికే ఓసి 5లో నూతన షావేల్స్ ప్రారంభించిన ఆర్జి 1 జిఎం




కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి

జిడికే ఓసి 5లో రెండు నూతన షావేల్స్ ను అర్జీ– 1 జిఎం లలిత్ కుమార్ చేతుల మీదుగా కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అర్జీ– 1 జిఎం లలిత్ కుమార్ మాట్లాడుతూ 3 క్యూబిక్ మీటర్ల సామర్థ్యం గల రెండు షావేల్స్ ను సుమారు 3.6 కోట్ల రూపాయల వ్యయంతో కొనుగోలు చేయటం జరిగిందని తెలిపారు. రెండు షావేల్స్ కు మంజీరా, మానేరు లుగా నామకరణం చేయటం జరిగిందని తెలిపారు. శావేల్స్ ను ఈ రోజు ప్రారంభించుకోవటం చాల సంతోషకరంగా ఉందని అన్నారు. రానున్న రోజులలో ఇట్టి షావేల్స్ ద్వారా మరింత బొగ్గు ఉత్పతి చేయటం జరుగుతుందని జిఎం తెలిపారు. గతంలో పాత షావేల్స్ తో ఇబ్బందులు ఉన్నప్పటికీ నూరు శాతం ఉత్పత్తి సాదించటం జరిగిందని ఇందుకు గాను ఉద్యోగులను అభినందించారు. ఇదే స్పూర్తితో కలిసి కట్టుగా రక్షణతో మనకు నిర్థేశించిన బొగ్గు ఉత్పతి లక్ష్యాలను సాదించాలని జిఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి డిప్యూటీ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, పిఒ చంద్ర శేఖర్, బ్రాంచి సెక్రటరీ అరెల్లి పోశం, ఏరియా ఇంజనీరు దాసరి వెంకటేశ్వర్ రావు, ఎ.ఎస్.ఓ సాయి ప్రసాద్, మేనేజర్ పోనోగోటి శ్రీనివాస్, రమేష్ బాబు, పెరుమాల శ్రీనివాస్, ఎస్.సి సివిల్ వర ప్రసాద్, ఫిట్ సెక్రటరి గుర్రం ప్రభుదాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పెళ్లి రోజున పుణ్యకార్యం




**– డయాలసిస్ పేషంట్ కు ఆపన్న హస్తం**

కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి

తమ పెళ్లి రోజు సందర్భంగా పుణ్యకార్యానికి పూనుకున్నారు. డయాలసిస్ పేషంట్ కు సంవత్సరం పాటు ప్రతి నెల పెన్షన్ ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని శ్రీరామ విద్యానికేతన్ హైస్కూల్ కరస్పాండెంట్ సూర్యదేవర జ్యోతి వెంకటేశ్వరరావు 44వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా అద్భుతమైన పుణ్యకార్యానికి రూపు దాల్చారు. తిలక్ నగర్ లో నివాసముండే రాజ్ కుమార్ గద్దల డయాలసిస్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఆదుకోవడానికి ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్న రాజకుమార్ ని హక్కున చేర్చుకొని ప్రతినెల పెన్షన్ రూపంలో రూ.521 ఇస్తానని జ్యోతి వెంకటేశ్వరరావు మాట ఇచ్చారు. శుక్రవారం రాజకుమార్ కు పెన్షన్ డబ్బులు రూ.521 అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాతలు ఎవరైనా ముందుకు వచ్చి తనను ఆదుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భరోసా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు నసీమా, పాఠశాల సిబ్బంది, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన ప్రణవ్ బాబు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మే 23**



జమ్మికుంట పట్టణంలో కొత్తపల్లి ఏరియాలో పది రోజుల క్రితం విజయగిరి వజ్రమ్మ వయసు 96 సంవత్సరాలు అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించిన హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వోడితల ప్రణవ్ బాబు వారితో ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇల్లంతకుంట దేవస్థానం మాజీ చైర్మన్ దేశిని కోటి . పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరి రమేష్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సతీష్ రెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు సాయిని రవి పరశురాం. అన్నం ప్రవీణ్. పథకాల అనిల్ . పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ పాల్గొన్నారు

# కృష్ణానగర్ లో సిసి రోడ్ల నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు



కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి

రామగుండం నగర పాలక సంస్థ నాలుగవ డివిజన్ కృష్ణానగర్ లో సిసి రోడ్లు నిర్మించడానికి రూ.2 కోట్లు మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నాలుగవ డివిజన్ లో పాత రోడ్లు శిధిలం కావడం, కొత్త కాలనీలు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం సిసి రోడ్లు నిర్మించాలని స్థానిక శాసన సభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ రామగుండం నగర పాలక సంస్థ ప్రత్యేకాధికారి, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు అంచనాలు తయారు చేసి సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించగా రామగుండం నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు రూ.2 కోట్లతో పనులు చేపట్టడానికి అంచనా లు తయారు చేసి సమర్పించారు. ఈ అంచనాలకు జిల్లా కలెక్టర్ ఆమోదం తెలుపడంతో పాటు రూ.2 కోట్లు మంజూరు చేస్తూ వెంటనే పనులు చేపట్టడానికి తగు చర్యలు తీసుకోవలసిందిగా రామగుండం నగర పాలక సంస్థ అధికారులను ఆదేశించారు. సాధ్యమైనంత త్వరగా టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ఎసి) అరుణశ్రీ తెలిపారు.